క్లుప్తంగా

వైభవంగా వరలక్ష్మీ పూజలు



రామమందిరంలో కొలువుదీరిన వరలక్ష్మి అమ్మవారు

సీతానగరం: శ్రావణమాసం ప్రథమ శుక్రవారం పర్వదినాన్ని పురస్కరించుకుని గ్రామాల్లోని రామాలయాలు, మందిరాల వద్ద శుక్రవారం వరలక్ష్మీ పూజలను మహిళలు వైభవంగా నిర్వహించారు. ఈ మేరకు సూరంపేట, మరిపివలస ఆలయాల్లో అమ్మవారిని వివిధ రకాల పూలతో అలంకరించి పూజలు నిర్వహించారు. అలాగే మండల కేంద్రంలోని ఆలయాల్లో వర లక్ష్మీ వ్రతాలు అర్చకుల ఆధ్వర్యంలో జరిగాయి.

ఆపద సమయంలో అవగాహనే మొదటి ఆయుధం



కాంప్లెక్స్‌లో ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్న పోలీస్ సిబ్బంది

పార్వతీపురం రూరల్: ఆపద సమయాల్లో బయట పడేందుకు అవగాహన కలిగి ఉండడమే మొదటి ఆయుధమని పోలీసు అధికారులు విద్యార్థులకు హితవు పలికారు. ఈ మేరకు శుక్రవారం పార్వతీపురం పట్టణంలో శక్తి టీమ్స్ పోలీస్ అధికారులు, సిబ్బంది శుక్రవారం పలు పాఠశాలలు, కళాశాలలు, బస్టాండ్స్, రద్దీ ప్రాంతాలను సందర్శించి విద్యార్థులకు గుడ్ టచ్- బ్యాడ్ టచ్, పోక్సో చట్టాలు, సైబర్ నేరాలు, మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలు అలాగే డయల్ 112 సేవలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రతి మహిళ తన మొబైల్ ఫోన్‌లో తప్పనిసరిగా శక్తి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని, అత్యవసర పరిస్థితుల్లో డయల్ 112, శక్తి యాప్‌లోని ఎస్‌ఓఎస్ బటన్‌ను ప్రెస్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో పార్వతీపురం శక్తి టీమ్ ఇన్‌చార్జ్ ఏఎస్సై శ్రీనివాసరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కుంకుమ పూజలు



కోటదుర్గమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

మక్కువ: మండలంలోని పలు గ్రామాల్లో శ్రావణమాసం తొలి శుక్రవారం సందర్భంగా భక్తులు ఘనంగా కుంకుమ పూజలు నిర్వహించారు. స్థానిక సాయి రామలింగేశ్వర ఆలయం, కోట దుర్గమ్మ ఆలయం, శంబర పోలమాంబ ఆలయం, కోన గ్రామంలోని దుర్గమ్మ ఆలయంలో అమ్మవార్లకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు తెల్లవారుజాము నుంచి ఉపవాసాలు ఆచరించి, ఆలయాలకు వెళ్లి, అత్యంత భక్తి శ్రద్ధలతో అమ్మవార్లకు పూజలు చేశారు.

పాఠశాలల బస్సుల తనిఖీ



బస్సులను తనిఖీ చేస్తున్న సీఐ అప్పలనాయుడు, ఎంవీఐ ప్రసాదరావు

సాలూరు: పట్టణంలో ప్రైవేట్ విద్యాసంస్థల బస్సులను సీఐ అప్పలనాయుడు, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాదరావులు శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వాహనాల రికార్డులను పరిశీలించారు. యూనిఫాం ధరించని, బస్సుల్లో ప్రథమ చికిత్స కిట్‌లు అందుబాటులో లేని మూడు బస్సులకు రూ.1800 జరిమానా విధించారు.సురక్షిత ప్రయాణాలు చేయాలని, పిల్లల భద్రత కోసం అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని హితవు పలికారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన తప్పనిసరి

పాలకొండ రూరల్: ప్రస్తుతం విస్తారంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని.. ఈ విషయంలో ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నవరం పీహెచ్‌సీ వైద్యులు సుజయ్‌కుమార్, అంకిత అన్నారు. శుక్రవారం స్థానిక పీహెచ్‌సీ ఆవరణలో వైద్య సిబ్బంది, ఆశ, అంగన్‌వాడీ, క్షేత్రస్థాయి అనుబంధ రంగాలకు చెందిన వారితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధులు ప్రబలే సమయంలో గ్రామీణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు.

నమ్మించి మోసం చేసిన ప్రభుత్వం

● మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు



జిల్లా కేంద్రంలో 16, 17 వార్డుల్లో బాబు ష్యూరిటీ- మోసం గ్యారంటీ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురం రూరల్: ఎన్నికల వేళ అధికారంలోకి వచ్చేందుకు అలవి కాని హామీలతో ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చాక హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిన ప్రభుత్వంగా కూటమి ప్రభుత్వం చరిత్రలో నిలిచిపోతుందని పార్వతీపురం మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం జిల్లా కేంద్రంలోని 16, 17వ వార్డులో స్థానిక కౌన్సిలర్, పట్టణ నాయకుల ఆధ్వర్యంలో గడప గడపకు వెళ్లి ప్రజలకు కూటమి ప్రభుత్వం ఎన్నికల వేళ హామీ ఇచ్చిన, అమలు కాని పథకాలపై ప్రజలను ఆరాతీస్తూ కూటమి ప్రభుత్వం ప్రజలకు చేసిన మోసాన్ని వివరించారు. రెండు వార్డుల్లో ఉన్న పలు వీధుల్లో ముందుగా భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలిశారు. ఈ మేరకు 16వ వార్డులో నిర్వహించిన సమావేశంలో మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు మాట్లాడుతూ మోసపూరిత హామీలు ఇవ్వడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అని అన్నారు. కూటమి ప్రభుత్వం నిరుద్యోగులకు భృతి ఇస్తామని, అలాగే 50ఏళ్లు దాటితే పింఛన్ ఇస్తామని ప్రజలను మభ్యపెట్టి మోసం చేసిందన్నారు.

ప్రజల తరపున పోరాటం

కూటమి మోసాలను ప్రజా క్షేత్రంలో నిలదీసి అమలు చేసేవరకు ప్రజల తరపున పోరాటం చేస్తామన్నారు. తమ అధినేత ఆలోచన మేరకు ఎన్నికల సమయం కానప్పటికీ ఎప్పుడూ ప్రజల సంక్షేమమే ఆలోచనే దిశగా తమ పార్టీ ఆలోచన ఉంటుందని ప్రతిపక్షంలో ఉన్న ప్రజల గొంతై కూటమి ఆగడాలను నిలదీస్తామన్నారు. ఏ గడపకు వెళ్లినా ప్రజలు కూటమి ప్రభుత్వంపై సంతృప్తికరంగా లేనట్లు స్పష్టమవుతోందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, వైస్ చైర్మన్లు కొండపల్లి రుక్మిణి, యిండుపూరు గున్నేశ్వరరావు, స్థానిక కౌన్సిలర్ సంగంరెడ్డి లక్ష్మీపార్వతి, పలు వార్డుల కౌన్సిలర్లు లావణ్య, సుధీర్, త్రినాథ, ఎస్సీసెల్ అధ్యక్షుడు శ్రీనివాసరావు, మైనార్టీ సెల్ విభాగం షేక్ షఫీ, పద్మావతి, గౌరీశంకరరావు, అనుబంధ విభాగాల నాయకులు మాధవరావు, సుధ, జలాల్, కాగాన ప్రకాష్, భాగ్యలక్ష్మి, నాగరాజు, సీనియర్ నాయకులు, స్థానిక వార్డు ప్రజలు, కార్యకర్తలు పాల్గొన్నారు

పుట్టూరులో బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ

పార్వతీపురం మండల నాయకుల ఆధ్వర్యంలో మండలంలోని పుట్టూరు గ్రామంలో బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొమ్మి రమేష్, బలగ నాగేశ్వరరావు, మజ్జి శేఖర్, వైస్ ఎంపీపీ రవికుమార్, స్థానిక సర్పంచ్ రెడ్డి సతీష్, ఏగిరెడ్డి రమణ, పార్టీ సీనియర్ నాయకులు ముప్పల సత్యం నాయుడు, మడక విశ్వనాథం, పెండ రమణ తదితరులు పాల్గొన్నారు.



పుట్టూరులో ఇంటింటికీ వంచన కరపత్రాన్ని అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ మండల నాయకులు

జిల్లాకేంద్రంలో కార్డన్ సెర్చ్



కార్డన్ సెర్చ్ ఆపరేషన్‌లో భాగంగా ఇందిరా కాలనీలో తనిఖీలు చేస్తున్న పోలీసులు

పార్వతీపురం రూరల్: అక్రమరవాణా నియంత్రణే లక్ష్యంగా ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడ్డి ఆదేశాల మేరకు నేర నియంత్రణ, గంజాయి, సారా, మద్యం అక్రమ రవాణా, నిల్వలు గుర్తించేందుకు, అనుమానిత వ్యక్తులపై నిఘా ఏర్పాటు చేసేందుకు శుక్రవారం ఉదయం పార్వతీపురంలో ''కార్డన్ సెర్చ్'' ఆపరేషన్ చేపట్టారు. ఈ ఆపరేషన్ నిర్వహణకు సంబంధించి ఇద్దరు సీఐలు, నలుగురు ఎస్సైలతో సహా, 40మంది పోలీసు సిబ్బంది, వీఆర్‌ఓల సమన్వయంతో పార్వతీపురం పట్టణంలో గల ఇందిరా కాలనీలో 170 ఇళ్లలో సోదాలు నిర్వహించారు. నేర చరిత్ర కలిగిన పాత నేరస్తులపై నిఘా ఉంచి వారి జీవన విధానం, నడవడికపై ఆరా తీసి, వారి ఇళ్లలో తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా వారి వద్ద లభించిన వాహనాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. గంజాయి, మద్యం, సారా అక్రమ నిల్వలపై సోదాలు చేసి కొత్త, అనుమానిత వ్యక్తులపై ఆరా తీసి నేర నియంత్రణ, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసేందుకు సోదాలు నిర్వహించారు. అదేవిధంగా జియ్యమ్మవలస మండలం బొడ్డవలస గ్రామంలో కూడా ఎస్సై ప్రశాంత్, సిబ్బందితో 'కార్డన్ సెర్చ్' ఆపరేషన్ చేపట్టారు. ఈ ఆపరేషన్‌లో పార్వతీపురం పట్టణ సీఐ మురళీధర్, రూరల్ సీఐ గోవిందరావు, సీతానగరం ఎస్సై రాజేష్, టౌన్ ఎస్సైలు జగదీష్ నాయుడు, గోవింద్, రూరల్ ఎస్సై సంతోషి, సిబ్బంది, స్పెషల్ పార్టీ, సీసీఎస్, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

ఆరోగ్యం పట్ల ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి



బాలగుడబలో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ శ్రీకాంత్, సిబ్బంది

పార్వతీపురం రూరల్: ఆరోగ్యం పట్ల ప్రజలు ముందస్తు జాగ్రత్తలు పాటిస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని బందలుప్పి పీహెచ్‌సీ వైద్యాధికారి డా.శ్రీకాంత్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం మండలంలోని బాలగుడబ గ్రామంలో 104 వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతున్న వారికి పరీక్షలు చేసి వారికి కావలసిన మందులిస్తూ జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జ్వరాలు ప్రబలే అవకాశముండడంతో రక్త నమూనాలు సేకరించి పరీక్షలు నిర్వహించాలని వైద్యసిబ్బందికి సూచించారు. సీజనల్ వ్యాధుల దృష్ట్యా గ్రామాల్లో ఫీవర్ సర్వే పక్కాగా చేపట్టి, జ్వర లక్షణాలున్న వారిని త్వరగా గుర్తించాలని ఆదేశించారు. మందుల కొరత లేకుండా చూడాలని ముందస్తు సమాచారంతో నిల్వలు ఉండేలా జాగ్రత్త పడాలన్నారు. రోగుల తనిఖీలను ఆన్‌లైన్‌లో పొందుపరచాలని, అలాగే దీర్ఘకాలిక వ్యాధులకు చికిత్స కూడా నెలవారీ సక్రమంగా 104 వాహనాల్లో జరగాలని, అధిక రక్తపోటు మధుమేహం తదితర మందులు రోగులకు సక్రమంగా పూర్తిస్థాయిలో అందాలని సూచించారు. ప్రజలకు సేవలు అందిస్తున్న 104 పనితీరు మెరుగుపడాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది, 104 సిబ్బంది పాల్గొన్నారు.

జీపీఎఫ్ నంబర్లు కేటాయించే బాధ్యత పీఆర్‌టీయూదే



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు అమరపు సూర్యనారాయణ

పార్వతీపురం రూరల్: శాసనమండలి సభ్యుడు గాదె శ్రీనివాసులు నాయుడు ప్రాతినిధ్యంలో జీపీఎఫ్ నంబర్లు కేటాయించే బాధ్యత పీఆర్‌టీయూ తీసుకుంటుందని పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు అమరపు సూర్యనారాయణ అన్నారు. ఈ మేరకు మున్సిపల్ ఉన్నత, ఎలిమెంటరీ పాఠశాలలను, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలను పార్వతీపురం మండల శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బొత్స నారాయణస్వామి ద్వారపురెడ్డి లక్ష్మినాయుడుల ఆధ్వర్యంలో పీఆర్‌టీయూ బృందం సందర్శించింది. మున్సిపల్ ఉపాధ్యాయులకు దశాబ్దాల కాలం నుంచి జీపీఎఫ్ నంబర్లు కేటాయించమని ప్రభుత్వాన్ని కోరినప్పటికీ కేటాయించకపోవడం బాధాకరమని అమరపు సూర్యనారాయణ ఈ సందర్భంగా అన్నారు. గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో అనేక సమస్యలను గుర్తించిన పీఆర్‌టీయూ బృందం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో మన్యం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వాలేటి తవిటినాయుడు, కాగాన విజయ్ రాష్ట్ర కార్యదర్శి జక్కు రామినాయుడు, జిల్లా కార్యదర్శి గుల్ల రామినాయుడు, భోగి శ్రీనివాసరావు, రెడ్డి ప్రసాదరావు, పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై జాగ్రత్తలు పాటించాలి



దోమల పిచికారీ పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ ఎంఎల్‌ఎన్ ప్రసాద్

సీతానగరం: మండలంలోని లక్ష్మీపురంలో శుక్రవారం పారిశుధ్య పనులను ఎంపీడీఓ ఎంఎస్‌ఎల్‌ఎన్ ప్రసాద్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో పారిశుద్య లోపం లేకుండా చూడాలని, అంటువ్యాధులు, జ్వరాలు ప్రబలకుండా ఉండేందుకు పంచాయతీ కార్యదర్శి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇప్పటికే గ్రామంలో జ్వరాలు ఉన్నాయని, ఆ విషయం దృష్టిలో పెట్టుకుని పారిశుధ్య పనులు వేగవంతం చేయాలన్నారు. 15రోజుల్లోగా గ్రామంలో పూర్తిస్థాయిలో పారిశుద్ధ్య పనులు నిర్వహించాలని, ఓవర్‌హెడ్ ట్యాంకును శుద్ధి చేయాలని సూచించారు. కార్యక్రమంలో పెదంకలాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి పి.రమ్య, సాయి, డిప్యూటీ ఎంపీడీఓ కుమార్ వర్మ, పంచాయతీ కార్యదర్శి, ఇంజినీరింగ్ సహాయకులు, సర్పంచ్ టి. సత్యవతి పాల్గొన్నారు.

కొటియా సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి



మంత్రి సంధ్యారాణి క్యాంపు కార్యాలయం వద్ద మాట్లాడుతున్న నాయకులు

● గిరిజనుల ర్యాలీ

సాలూరు: కొటియా సరిహద్దు గ్రామాల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించాలని ఆదివాసీ గిరిజన సంఘం, ఇతర సంఘాల నాయకులు, గిరిజనులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం సాలూరులోని మెయిన్‌రోడ్డు నుంచి గిరిజన, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి ఇంటి వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు మాట్లాడుతూ, కొటియా గ్రామాల్లో గిరిజనులపై, అక్కడ సాగుచేసుకుంటున్న గిరిజనుల భూములపై , అంగన్వాడీ కేంద్రాలపై దాడులు చేస్తూ ఒడిశా ప్రభుత్వం అక్కడి గిరిజనులను భయభ్రాంతులకు గురిచేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. వారికి రక్షణగా ఉండాల్సిన ఆంధ్రా ప్రభుత్వం మౌనంగా ఉండడం సరికాదని, వారికి శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఎన్‌వైనాయుడు, కోరాడ ఈశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మర్రి శ్రీనివాసరావు, ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు తాడంగి సన్నం, కొంబులు, చరణ్, కూనేటి సుబ్బారావు, ముసిరి, చింత జోగయ్య, మర్రి మసి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు మోసాలకు బుద్ధి చెప్పాలి



బలిజిపేట: వెంగళరాయపురంలో ప్రచారం చేస్తున్న నాయకులు

బలిజిపేట:

చంద్రబాబు మోసాలను ప్రజలు గుర్తించి బుద్ధిచెప్పాలని బలిజిపేట ఎంపీపీ నాగమణి అన్నారు. ఈ మేరకు సర్పంచ్ జి.లక్ష్మి ఆధ్వర్యంలో వెంగళరాయపురం గ్రామంలో చంద్రబాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహిస్తూ ఇంటింటికీ తిరిగి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ నాగమణి మాట్లాడుతూ చంద్రబాబు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమయ్యారని, దీనిని ప్రజలు గుర్తించి భవిషత్‌లో కూటమి ప్రభుత్వానికి బుద్ధిచెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పి.మురళీకృష్ణ, జెడ్పీటీసీ ఎ.రవికుమార్, మండల ఉపాధ్యక్షుడు వి.సాయిరాం, జి.సత్యంనాయుడు, జి.పకీరునాయుడు, మేధావుల సంఘం జిల్లా అధ్యక్షుడు పీఎస్ఆర్ నాయుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధానకార్యదర్శి టి.ప్రసాదరావు, రాష్ట్ర వాణిజ్య విభాగం డైరక్టర్ వాసుదేవరావు, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఏసు, మండల వీవర్స్ సొసైటీ అధ్యక్షుడు నారాయణరావు, వైఎస్సార్‌సీపీ మండల కార్యదర్శి కె.సత్యంనాయుడు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సీతానగరంలో..

సీతానగరం: వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బి.శ్రీరాములు నాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు బి. చిట్టిరాజుల ఆధ్వర్యంలో శుక్రవారం సీతానగరం మండలంలోని రామవరం, ఆర్‌వెంకంపేట గ్రామాల్లో బాబు ష్యూరిటీ- మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రామవరంలో మాజీ సర్పంచ్ పి.కృష్ణమూర్తి, విశ్రాంత వీఆర్‌ఓ పి.సూర్యనారాయణ, ఆర్. తవిటినాయుడులతో కలిసి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు ఇంటింటికి తిరుగుతూ వివరించారు. కార్యక్రమంలో చెరకు అభివృద్ధిమండలి మాజీ చైర్మన్ ఎస్.రామకృష్ణ, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జిల్లా, మండల పార్టీ నాయకులు వై.వెంకటనాయుడు, వై.జగన్నాథం నాయుడు, బి.శంకరరావు, వై. గోపాల్, బి.ముకుంద, వేణు, బి.శివకుమార్, ఆర్‌వీ పార్థసారథి, బల్ల త్రినాథ, లచ్చయ్యపేట పాస్టర్ రాములు పాల్గొన్నారు.



సీతానగరం: ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

శాఖాపరమైన సమస్యల పరిష్కారానికి 'పోలీస్ వెల్ఫేర్ డే'

పార్వతీపురం రూరల్: శాఖాపరమైన సమస్యల పరిష్కారానికి, సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తూ పోలీసు సిబ్బందికి వెల్ఫేర్‌డే (గ్రీవెన్స్ డే) నిర్వహించి చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం పోలీసు శాఖలో వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది నుంచి వచ్చిన విజ్ఞాపనలు స్వీకరించి సమస్యల పట్ల సానుకూలంగా స్పందించి పరిష్కార చర్యలకు ఎస్పీ ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో సీసీ సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వర్మీకంపోస్టు సిద్ధం

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని కుక్కిడి గ్రామంలోని చెత్త సంపద తయారీ కేంద్రంలో 300 కిలోల వర్మీకంపోస్టు సిద్ధంగా ఉన్నట్లు ఎంపీడీవో పి.త్రివిక్రమరావు తెలిపారు. శుక్రవారం ఆ గ్రామాన్ని సందర్శించిన ఆయన..రక్షిత మంచినీటి పథకాన్ని, చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలించి, పలు సూచనలు చేశారు. పారిశుధ్యానికి ప్రాధాన్యమిస్తూ తాగునీటి పథకాల్లో క్లోరినేషన్ పనులు చేపట్టాలన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి



కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ రత్నంరాజు

పాలకొండ:

నగర పంచాయతీలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని కౌన్సిల్ సభ్యులు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో చైర్‌పర్సన్ ఆకుల మల్లీశ్వరి అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో నూతన కుళాయిల కనెక్షన్ల మంజూరు కోసం అజెండాలో పెట్టడంపై సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. సంబంధిత వార్డు కౌన్సిలర్లతో చర్చించి అవకాశం ఉంటే మంజూరు చేయాలని తెలిపారు. 4, 5 వార్డుల పరిధిలో తాగునీటి సమస్యలున్నాయని కౌన్సిలర్లు కొరికాన గంగునాయుడు, వెలమల మన్మథరావు ప్రస్తావించారు. పైప్‌లైన్లు లేకపోవడంతో ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. దీనిపై కమిషనర్ రత్నంరాజు మాట్లాడుతూ.. ఈ ప్రాంతంలో కనీసం బోర్లు వేసేందుకు కూడా అవకాశం లేదని తెలిపారు. వడమ కల్యాణి చెరువు గట్టుపై శివాలయం నిర్మాణానికి అడ్డంకులు తొలగించాలని కోరారు. అనంతరం పలు అభివృద్ధి పనులకు తీర్మానం చేశారు. సమావేశంలో కౌన్సిలర్లు, నగర పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు దూరం

● సీఐ కె. మురళీధర్

పార్వతీపురం రూరల్:

నిబంధనలు పాటిస్తేనే ప్రమాదాలను అరికట్టవచ్చునని పార్వతీపురం పట్టణ సీఐ కె.మురళీధర్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం ట్రాఫిక్ ఎస్సై పాపారావు నేతృత్వంలో పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద ఆటో, ద్విచక్ర, పలు వాహన దారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ రోడ్డుమీద ప్రయాణించేటప్పుడు వాహనాలను అతివేగంతో నడపరాదని, రోడ్డు ఉన్న పరిస్థితి మేరకు తోటి వాహనాలను దృష్టిలో పెట్టుకుని నిర్దిష్టమైన వేగంతో వెళ్లాలని సూచించారు. రోడ్డుపై ప్రయాణించే ప్రతి ఒక్కరి జీవితం మన ప్రయాణ మార్గంలో భాగమేనని వాహనాలు నడిపేటప్పుడు నిర్లక్ష్యంగా నిబంధనలు పాటించకుండా, రోడ్డు భద్రత నియమాలు పాటించకుండా వ్యవహరిస్తే మనతోపాటు రోడ్డుపై ప్రయాణించే తోటి వాహన దారులకు ప్రమాదం జరిగే అవకాశం ఉందని అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించి సురక్షితంగా గమ్య స్థానాలకు చేరుకోవాలని సూచించారు. ప్రధానంగా ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించరాదన్నారు. జిల్లా కేంద్రంలో పలు కూడళ్లలో ఆటోలను నిలిపివేస్తూ వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలిగేలా ప్రవర్తించరాదని కోరారు.



వాహన దారులకు అవగాహన కల్పిస్తున్న పట్టణ సీఐ కె. మురళీధర్, ట్రాఫిక్ ఎస్సై పాపారావు